UTF
ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్
A.P.UNITED TEACHERS' FEDERATION
చెన్నుపాటి భవన్, పాలపర్తివారి వీధి, విజయవాడ-520002
ఇ-మెయిల్: aputf1974@gmail.com; వెబ్‌సైట్: www.aputf.org; ఫోన్ నం.:0866-2973763

Shaik Sabjee
9440016343

P. Babu Reddy
9490300650

ప్రచురణార్థం

తేది: 22.06.2020

# ఉపాధ్యాయులను విద్యార్థుల కోసం ఉపయోగించండి - యుటియఫ్

కరోనా తీవ్రత రోజు రోజుకు పెరుగుతోందని ప్రభుత్వమే చెబుతోంది కాని విద్యాశాఖలో రోజుకొక ఉత్తర్వులతో గందరగోళం సృష్టిస్తున్నారు. డైస్ వివరాలు, నాడు-నేడు పనులు ఆన్‌లైన్‌లో వివిధ రకాల సమాచారం అప్‌డేట్ చేయడం కోసం అన్ని పాఠశాలల్లో అందరూ హాజరు కావాలని ఉత్తర్వులు ఇవ్వడం పున:పరిశీలించాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు షేక్ సాబ్జీ, పి.బాబురెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

విద్యాశాఖ ఉత్తర్వులలో పేర్కొన్న యు-డైస్ వివరాలు, నాడు-నేడు వివరాలు, కాంప్లెక్స్ మీటింగ్ వివరాలు, లైబ్రరీ, లేబటరీ, టాయిలెట్స్, కిచెన్ షెడ్స్ కొన్ని పాఠశాలలనుండి మాత్రమే రావాల్సి వుంది. వాటిని ఆయా పాఠశాలల సిబ్బంది సమన్వయంతో అప్‌డేట్ చేయవచ్చు. అందుకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని అందరు ఉపాధ్యాయులు హాజరు కావాల్సిన అవసరం ఏమిటి అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బయోమెట్రిక్ అంటెడెన్స్ రద్దు చేయాలని ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. రాష్ట్రంలో రవాణా సౌకర్యాలు పూర్తిగా పునరుద్ధరణ జరగలేదు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు మారుమూల గ్రామాలకు వెళ్ళడం ఆచరణలో ఎలా అనేది ప్రభుత్వం ఆలోచించాల్సి ఉంది.

రాష్ట్రంలో రోజు రోజుకు కరోనా ప్రభావం తీవ్రంగా పెరుగుతోందని ప్రభుత్వమే ప్రకటిస్తోంది. సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిమిత సంఖ్యలో ఉద్యోగులు హాజరుకావాలని, మిగిలిన వారు ఇంటినుండే పనిచేయాలని ఆదేశాలు ఇచ్చియున్నారు. కానీ విద్యాశాఖలో  కేవలం బోధనేతర పనులు కోసం అవసరంలేని వాళ్లను కూడా పాఠశాలలకు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చారు.

## విద్యార్థుల కోసం పని చేస్తాం

పాఠశాలలు మూసివేసి సుమారు 4 నెలలు అవుతోంది. కరోనా ప్రభావం గ్రామాలకు కూడా విస్తరించిన నేపథ్యంలో విద్యార్థులను పాఠశాలల్లో ఒకచోటకు చేర్చకుండా వారికి బోధనా కార్యక్రమాల పట్ల ప్రత్యామ్నాయా ఏర్పాట్లు చేయాలి. అందుకు ఉపాధ్యాయుల నుండి పూర్తి సహకారం ఉంటుంది. ఇప్పటికే కొంతమంది ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యార్థులకు బోధన కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులందరికీ లాప్‌టాప్‌లు లేదా టాబ్‌లు ఇవ్వాలి. వాటిని ఉపయోగించి పిల్లలకు పాఠ్యాంశాలు ఇతర అకడమిక్ విషయాలు అందించే చర్యలు చేపట్టాలి. అందుకు ఉపాధ్యాయులను వినియోగించుకోవాలి. విద్యార్థులకు విద్యనందించేందుకు ప్రత్యామ్నాయ విధానాల కోసం అందరితో చర్చించాలని యుటియఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఇట్లు
భవదీయులు

(షేక్ సాబ్జీ)
అధ్యక్షులు

(పి.బాబురెడ్డి)
ప్రధానకార్యదర్శి